శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు

పట్టించుకోని నాయకులు, అధికారులు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో ప్రభుత్వ కార్యాలయాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నా కార్యాలయాలు వందేళ్లు దాటినా గానీ నిర్మాణానికి నోచుకోకపోవడం శాపమా? ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. టీడీపీ కంచుకోటగా పేరున్న ఉండి నియోజకవర్గ కేంద్రం ఉండిలో ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి అధ్వానంగా మారింది. ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1906లో నిర్మించారు. 118 ఏళ్లు అయినా ఈ కార్యాలయ పునర్నిర్మాణ సంగతి ఎవరికీ పట్టడం లేదు. ఏడాదికి రూ.300 కోట్లు నుంచి 350 కోట్ల మేర లావాదేవీలు జరిగే ఈ కార్యాలయం శిథిలస్థితికి చేరింది. గతంలో రికార్డులకు చెదలు పట్టడంతో ఎంతో అమూల్యమైన సమాచారం పాడైపోయింది. అయితే ఇప్పుడు కార్యాలయానికి ఆనుకుని ఉన్న హైవే కారణంగా చిన్నపాటి చినుకులు పడినా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముంపునకు గురవుతుంది. అలాగే కార్యాలయం కూడా చెమ్మగిల్లడంతో భద్రపరచిన రికార్డులు నాశనం జరిగే అవకావం వుందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

తరలిపోయిన ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం

ఎన్నో ఏళ్ల క్రితమే ఉండి ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయం ఉండి నుంచి భీమవరానికి తరలిపోయింది. భీమవరం జిల్లా కార్యాలయంపై ఓ గదిలో ఈ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. అందుకే ఉండి పరిసర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా తయారైనా పట్టించుకునే అధికారి ప్రక్క నియోజకవర్గం భీమవరంలో ఉండటంతో రోడ్ల పరిస్థితి దారుణంగా మారిపోయింది. అయినా నియోజకవర్గ కేంద్రం ఉండిలో ఉండాల్సిన ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ కార్యాలయం పక్క నియోజకవర్గంలో ఉన్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడం గమనార్హం. అయితే ఉండిలో ఉండాల్సిన కార్యాలయం ఏళ్ల క్రితమే కూలబడిపోయినా దాని పునర్నిర్మాణ ఊసేలేదు. దీంతో అధికారులు కంటికి కనిపించే పరిస్థితి లేకుండా పోయింది.


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం క్షీణదశకు చేరుకున్న వైనం


కూలిపోయిన ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ ఇంజినీర్ కార్యాలయం (ఫైల్)

పక్క నియోజకవర్గంలో మా కార్యాలయమా?



నియోజకవర్గ కేంద్రం ఉండి నుంచి ఏళ్లతరబడి ఆర్‌అండ్‌బీ కార్యాలయం పక్క నియోజకవర్గంలో ఉంటే ఏమనుకోవాలి. నియోజకవర్గంలో పని జరగాలంటే పక్క నియోజకవర్గానికి వెళ్లి చెప్పాలా? అధికారులు అందుబాటులో ఉంటేనే ఏదైనా పని జరుగుతుంది. కానీ సౌలభ్యంపేరిట ఇతర నియోజకవర్గంలో ఉండి సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం ఎంత వరకు సమంజసం.

– బందెల జార్జ్, చెరుకువాడ, ఉండి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పునర్నిర్మించాలి



ప్రభుత్వానికి ప్రతి ఏటా కోట్లాది రూపాయలను అందిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇంత నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నూతన కార్యాలయాన్ని నిర్మాణం చేపట్టాలి. లేకుంటే విధులు నిర్వర్తించే అధికారులతో పాటు కార్యాలయానికి వెళ్లే ప్రజలకు కూడా ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది.

– జంపా నాగేశ్వరరావు, ఉండి

క్లుప్తంగా

మోషేనురాజును కలిసిన డీఈఓ


మోషేనురాజుకు పూలమొక్క అందిస్తున్న డీఈఓ నారాయణ

భీమవరం: జిల్లా విద్యాశాఖాధికారిగా నియమితులైన ఇ.నారాయణ మంగళవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు మర్యాదపూర్వకంగా కలిశారు. భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మోషేనురాజు కలిసి పూలమొక్కను అందించారు.

విద్యా సామగ్రి పంపిణీ

కాళ్ల: విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమని కలవపూడి సీబీసీ ఎంసీ పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. కలవపూడి గ్రామంలో తపాల శాఖలో విధులు నిర్వహిస్తున్న పోస్టుమ్యాన్ సోమవాసి యాకోబు ఆర్థిక సహాయంతో సుమారు 20 మంది విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. దాతను ఉపాధ్యాయులు అభినందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత సేవా సభ్యులు

పాలకోడేరు: దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు ప్రతి ఇంట్లో వెలగాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ అధ్యక్షులు ఉదయ్ కుమార్ అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ సభ్యుల వారి ఆధ్వర్యంలో మంగళవారం పాలకోడేరు మండలం లోని పెన్నాడ అగ్రహారం, పెన్నాడపాలెం గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయ్ కుమార్, నాగేశ్వరరావు, వాసుదేవా, రాజు , తారకేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ


అమ్మవారికి సారె సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మెంటేవారి తోటలో ఉన్న విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారికి భక్తులు సారే సమర్పించారు. పట్టణానికి చెందిన తలగళ్ళ వెంకటేశ్వరరావు, పావని సత్య ఝాన్సీ లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులతో అమ్మవారికి ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. ముందుగా సారే ఊరేగింపు ఆలయానికి తీసుకుని వచ్చి ఆలయ ప్రాంగణంలో పూజలు చేసి అమ్మవారికి నివేదన చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బాణసంచా దుకాణాల ఏర్పాటు


చూట్ మెమోరియల్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

ఆకివీడు: స్థానిక చూట్ మెమోరియల్ హైస్కూల్ ఆవరణలో రిటైల్ బాణసంచా మంగళవారం దుకాణాలను ప్రారంభించారు. ప్రభుత్వ అనుమతితో సుమారు 22 బాణసంచా విక్రయ దుకాణాలను స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. ఆయా షాపుల వద్ద అగ్నిప్రమాద నివారణా వస్తువులను అందుబాటులో ఉంచారు. డ్రమ్ముల్లో నీరు, ఇసుక అందుబాటులో ఉంచి, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. దుకాణాల ఏర్పాటుకు కూటమి నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు.

కాళ్లలో 15 దుకాణాలు

కాళ్ల: దీపావళి సందర్భంగా కాళ్ల మండలంలో 21 గ్రామాల్లో మొత్తం 15 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దారు జి.సుందర్ సింగ్ మంగళవారం తెలిపారు. మండలంలో ఏలూరుపాడులో 5, కాళ్లలో 4, కాళ్లకూరులో 1, పెదఅమిరంలో 1, సీసలిలో 2, జువ్వలపాలెంలో 1, బొండాడలో 1 చొప్పున బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తరపున అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. దుకాణాల వద్ద నిబంధనల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలి

నరసాపురం: డీఎస్సీ ఉచిత శిక్షణపై అవగాహన కల్పించాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి కె.బాలుసాధన సూచించారు. మంగళవారం స్థానిక వైఎన్ కళాశాలలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, పాలకొల్లు, పోడూరు మండలాలకు చెందిన సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాలుసాధన మాట్లాడుతూ ఉచితంగా అందిస్తున్న డీఎస్సీ శిక్షణకు తక్కువ సంఖ్యలో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అభ్యర్థుల్లో అవగాహన పెంచాలని చెప్పారు. సచివాలయ పరిపాలనా యంత్రాంగంలో ఎక్కడా లోపాలు లేకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని చెప్పారు. విద్యార్థుల ఉపకార వేతనాల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

కాళ్ల: భూములకు సంబంధించి రీ–సర్వే తప్పిదాలు సరిదిద్దుకునేందుకు ప్రస్తుత ఏర్పాటు చేసిన రెవెన్యూ రీసర్వే గ్రామసభలు కాళ్ల మండలంలో ముగిశాయని తహసీల్దార్ జి సుందర్ సింగ్ మంగళవారం తెలిపారు. మండలంలోని సీసలి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ రీ సర్వే లో పాల్గొని భూ యజమానులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించి మాట్లాడారు. కాళ్ల మండలంలో అక్టోబర్ 18న ప్రారంభమైన ఈ గ్రామ సభలు మంగళవారం నాటికి పూర్తయ్యాయన్నారు. జక్కరంలో 11, వేంపాడు 18, ప్రాత్యాళ్లమెరక 3, పెదఅమీరం 30, కోపల్లె 16, కోలనపల్లి 28, ఏలూరుపాడు 22, సీసలి గ్రామంలో 29 చొప్పున భూయజమానులు తమ తమ భూములకు సంబంధించి మండలం మొత్తం 157 ఫిర్యాదులు అందాయని తెలిపారు.


కాళ్ల: సీసలి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుందర్ సింగ్


వీరవాసరం: కొణితివాడలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కొణితివాడలో..

వీరవాసరం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తహసీల్దార్ ఏ.వి రామాంజనేయులు తెలిపారు. కొణితివాడలో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. భూముల సర్వేలో జరిగిన సవరణలో ఇటువంటి లోటుపాట్లు ఉన్న అర్జీలు ద్వారా సమావేశం దృష్టికి తీసుకురావచ్చన్నారు. కొణితివాడ రీ–సర్వేకి సంబంధించి 126 అర్జీలు వచ్చాయని కార్యక్రమంలో ఆర్ఐ రూజ్ వెల్ట్ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు పెడితే కఠిన చర్యలు

భీమవరం: భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని భీమవరం పట్టణం, వీరవాసరం, భీమవరం మండలాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మద్యం ఎంఆర్‌పీ ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. మద్యం షాపులు మినహా ఎక్కడా మద్యం విక్రయించినా చట్టప్రకారం కేసు నమోదుచేస్తామని బలరామరాజు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే 94409 02439 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్లు నిర్మించాలని ధర్నా

భీమవరం: మండలంలోని వెంప, దెయ్యాల తిప్ప ఆర్‌అండ్‌బీ రోడ్లు వెయ్యాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ఎంఆర్‌ఓ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించి, తహసీల్దార్ బి.రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ వెంప, దెయ్యాల తిప్ప ఆర్‌అండ్‌బీ రోడ్లల్లో పెద్దపెద్ద గ్రోతులతో ఉండటం వల్ల ప్రమాదాల జరుగుతున్నాయన్నారు. గర్భిణులు బాలింతలు అనేక సమస్యలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరావు, తోటే శుభాకరరావు, పొన్నమండ నాగేశ్వరావు, ఈద భూషణం, నేతల కృపాదనం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.97.50 లక్షల విరాళం

భీమవరం: భీమవరం నియోజకవర్గం నుంచి విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు సుమారు రూ.97.50 లక్షలు దాతలు విరాళంగా అందించారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) చెప్పారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విరాళం మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ కృషితో భీమవరం–లోసరి, భీమవరం–పిప్పర రహదారుల అభివృద్ధికి రూ. 100 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. విలేకర్ల సమావేశంలో కోళ్ల నాగేశ్వరరావు, పాతూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారికి అండగా నిలవాలి


భీమవరంలో వైద్యుడు మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం


మావుళ్లమ్మ ఆలయ ఆవరణలో ధన్వంతరి పూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: తరతరాలుగా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తూ ఆలయాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో సేవలందిస్తున్న చేతివృత్తుల వారికి ప్రభుత్వం అండగా నిలవాలని జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు అన్నారు. ఆయుర్వేద వైద్య మూలపురుషుడు ధన్వంతరి స్వామి జయంతి సందర్భంగా మంగళవారం భీమవరం పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం, మంగళ వాయిద్య కళాకారుల సంఘం, నాయి బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పురాతన కాలంలో వైద్య సదుపాయాలు లేని సమయంలో నాయి బ్రాహ్మణులు ఆయుర్వేద వైద్యులుగా గ్రామీణ ప్రజలకు నాటి పాలకులకు సేవలందించారని గుర్తు చేశారు. ముందుగా ధన్వంతరి స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యోగ సంఘ నాయకుడు మల్లువలస శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామీణ వైద్యుడు గోరంట్ల మహేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు మల్లువలస రఘుబాబు, తాడి మావుళ్ళు, వేపాడ పెద్దిరాజు, మల్లువలస మావుల్లు, ఎంవీ సత్యనారాయణ సీహెచ్ బంగారరావుయ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఆలయంలో

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీమావుళ్లమ్మవారి ఆలయంలో మంగళవారం ధనత్రయోదశి సందర్భంగా శ్రీమహాలక్ష్మి ధన ధాన్య ధన్వంతరి పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 400 మంది భక్తులు పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి నగేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అన్ని శాఖలూ సమన్వయంతో పని చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం వచ్చే నెల 2 తేదీ నుంచి నిర్వహించే కార్తీకమాస మహోత్సవాలపై మంగళవారం దేవస్థానంలో వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మహోత్సవాలను ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీసు ట్రాఫిక్‌పై శ్రద్ధ తీసుకుని ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం చేసుకునేలా తగు సిబ్బందిని నియమించుకుని గట్టి భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ అలంకరణ పనులు, విద్యుత్ సరఫరా, భద్రతపై చాలా అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు అందుబాటులో వైద్యారోగ్య శాఖ అధికారులు అందుబాటులో ఉండి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటి అధికారులు శానిటేషన్ నిరంతరం మెరుగ్గా ఉండేలా తగు చర్యలు తీసుకొవాలని సూచించారు. భక్తులకు క్యూలైన్లు, మంచినీటి ఇబ్బంది లేకుండా ముందస్తుగానే దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేసుకొవాలని సూచించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పంచారామ క్షేత్రంలో కార్తీక మాస మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఆలయ ఈవో కృష్ణంరాజు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న భీమవరం ఆర్డీఓ ఎ.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పోలీసులకు ప్రజలు సహకరించాలి


భీమవరంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న దృశ్యం


లూథరన్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: పోలీసులకు ప్రజలు సహకరిస్తే శాంతి భద్రతలు మరింత అదుపులో ఉంటాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు సిబ్బంది, పట్టణ ప్రజలు కొవ్వొత్తులను చేతపట్టుకుని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద నుంచి తాలూకా ఆఫీసు, ప్రకాశంచౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ హైస్కూల్లో..

పోలీసు శాఖ, శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా మంగళవారం లూథరన్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం వన్‌టౌన్ ఎస్సై కృష్ణాజీ మాట్లాడుతూ పోలీసులు నిరంతర ప్రజా రక్షణకు పాటుపడుతుంటారని వారికి ప్రజలు కూడా సహకరిస్తే ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు పులపర్తి శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్‌ఎం మణిరాజ్, శ్యామల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లకోడు ఇళ్ల స్థలాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి గ్రామ శివారు తాళ్లకోడులోని జగనన్న పేదల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పట్టణ పౌరుల సంక్షేమ సంఘం కన్వీనర్ బీవీ వర్మ డిమాండ్‌చేశారు. తాళ్లకోడులోని 74 ఎకరాలల్లోని పేదల ఇళ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు లేవని, వర్షం వస్తే ముంపునకు గురవుతుందని, తాగడానికి మంచినీళ్లు లేవని, విద్యుత్ వీధి దీపాలు వెలగడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పేదల ఇళ్ల కోసం సీపీఎం 25 ఏళ్ల పోరాట ఫలితంగా ఏర్పడిని కాలనీలో పేదలు సొంతంగా వెయ్యి మందికి పైగా ఇళ్లు నిర్మించుకున్నారని చెప్పారు. మరో వెయ్యిమంది ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. 3500 మంది నివాసం ఉండే కాలనీలో కనీస వసతుల లేవని వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే పడవలపై వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే ఈ ప్రాంతాన్ని ఆకివీడు నగర పంచాయతీలో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. తాళ్లకోడులో వసతులకు కుప్పనపూడి గ్రామ పంచాయతీ తమ పరిధి కాదని చేతులు దులుపుకుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ స్పందించి తాళ్లకోడుకు ప్రత్యేక గ్రాంట్ విడుదల చేసి ప్రత్యేక అధికారి ద్వారా పర్యవేక్షించి పనులు చేపట్టాలిన కోరారు. కార్యక్రమంలో నాయకులు జి.ధనుష్, కె.ప్రసాద్, ఏ.ఏసు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


తాళ్లకోడులో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆందోళన చేస్తున్న దృశ్యం

బ్లాక్ చైన్ టెక్నాలజీలో నిపుణుల కొరత

భీమవరం: దేశంలో బ్లాక్ చైన్ టెక్నాలజీలో నిపుణుల కొరత ఎక్కువగా ఉందని ఇన్ఫర్మేషన్ డేటా సిస్టమ్స్ (ఐడిఎస్) స్ట్రాటజీ పార్టనర్ షిప్ హెడ్ ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యం అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భారత్ బ్లాక్ చైన్ నెట్‌వర్క్ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ సుబ్రహ్మణం మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్యం, బ్యాంకింగ్, కార్పొరేట్ ఆర్థిక అంశాలపై స్పష్టత, రికార్డింగ్ తిరిగి పరిశీలన చేసే అంశాలు బ్లాక్‌చైన్ టెక్నాలజీలో ఉన్నాయన్నారు. రాబోయే రెండేళ్లలో ఇందులో నిపుణులకు పెద్ద ఎత్తున అవకాశాలు పెరుగుతాయని సునీల్‌సుబ్రహ్మణ్యం స్పష్టంచేశారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఇనోటెక్ ఫౌండర్ అండ్ సీఈఓ బి.మల్లేష్, సీఐసీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెవి కృష్ణంరాజు, బీహెచ్‌విఎస్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో మాట్లాడుతున్న సునీల్ సుబ్రహ్మణ్యం

అధ్వానంగా జాతీయ రహదారి

- అడుగడుగునా గుంతలు
- ప్రమాద హెచ్చరిక బోర్డులతో సరి

ఆకివీడు: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా జాతీయరహదారి నెం.165 పరిస్థితిఉంది. మా ప్రాంత నాయకులు గొప్పగొప్ప పదవుల్లో ఉన్నారు.. మేము మాత్రం గుంతలు, గుంతల రోడ్లులో ప్రయాణిస్తున్నామని గర్వంగా చెప్పుకుంటున్నామని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఈ జాతీయ రహదారి ఏళ్ల తరబడి విస్తరణకు, పునర్నిర్మాణానికి నోచుకోకుండా ఉంది. అడుగడుగునా గుంతలమయంగా మారింది. రహదారిపై ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందేనని ప్రయాణికులు, వాహనచోదకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వర్షం వచ్చిందంటే అది కొన్ని ప్రాంతాల్లో జాతీయ రహదారి కాదు చిన్నపాటి చెరువును తలపిస్తోందని వాపోతున్నారు. ఆకివీడు నుంచి భీమవరం వరకూ ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండున్నర దశాబ్దాలుగా అంగుళం అభివృద్ధి జరగని జాతీయరహదారి ప్రయాణీకులను వాహనచోదకులను నిత్యం వేధిస్తుంది.

జాతీయ హోదాతో ఇబ్బందులు

పామర్రు నుంచి దిగమర్రు వరకూ ఉన్న ఈ రహదారి గతంలో పాలకొల్లు నుండి పామర్రు వరకూ రాష్ట్ర రహదారిగా ఉండేది. ఆ సమయంలోనే రోడ్డుపై ప్రయాణం ఇబ్బంది లేకుండా ఉండేది. రోడ్డుకు హోదా వచ్చినప్పటికీ అభివృద్ధిలో మాత్రం ఆ శాఖ అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ నాలుగురైదుగురు ఎంపీలు తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కేంద్ర రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆకివీడులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో రహదారి విస్తరణకు ఆన్‌లైన్ శంకుస్థాపనలు చేశారు. సుమారు దశాబ్ద కాలం గడుస్తున్నా ఆకివీడు, ఉప్పుటేరు వద్ద నుంచి దిగమర్రు వరకూ ఒక్క లేయర్ రోడ్డు వేసిన దాఖలాలు లేవు. జాతీయరహదారుల శాఖ అధికారులం మేము ఉన్నామని అనిపించుకోవటానికి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే కొన్ని చోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు ఉప్పుటేరు నుంచి దిగమర్రు వరకూ రోడ్డు విస్తరణ, అభివృద్ధి, బైపాస్ రోడ్ల నిర్మాణానికి రూ. 1500 కోట్ల మేర నిధులు మంజూరు చేసినా పనులు పత్తా లేకుండా పోయాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు వెంటనే స్పందించి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.


ఉప్పుటేరు వంతెన వద్ద నుండి భీమవరం వరకూ గుంతల మయంగా మారిన జాతీయ రహదారి